వైభవంగా వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మార్మోగిన గోవింద నామస్మరణ


కసాపురంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లులో క్యూకట్టిన భక్తులు

సాక్షి నెట్ వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు తెల్లవారుజామునే ఆలయాల్లో ఉత్తర ద్వారాల నుంచి స్వామి మూలవిరాట్‌లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాలంకరణలో మెరిశాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తాడిపత్రిలోని చింతల రాయుని ఆలయం ప్రాంగణమంతా గోవింద నామస్మరణలతో మార్మోగింది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయం ముందు బారులు తీరారు. ఆలయ ఉత్తర ద్వారా తెల్లవారుజామున 4గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వారా దర్శనం కల్పించారు. అలాగే పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- గుంతకల్లు పట్టణంలోని శ్రీవారి ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో పులకించిపోయాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పట్టణ ప్రముఖులు, అధికారులు ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భక్తమండలి అధ్యక్షులు ఎం.భాస్కర్ రంగయ్య, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు,కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్ గుప్త, జయంతి వెంకట్ తదితర కమిటీ ప్రతినిధులు భక్తాదులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే పట్టణ నడిబొడ్డున అతి పురాతన కోదండరామస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈఓ మఠం మల్లికార్జున, సేవాదాతలు భక్తాదులకు తీర్థప్రసాదాల అందజేసి అన్నదానం చేశారు. అలాగే గుంతకల్లు,గుత్తి, పామిడి మండలాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- శింగనమలలోని చెన్నకేశవాలయంలో తెల్లవారుజామున 3 గంటలకే ద్వారాలు తీసి, స్వామికి అభిషేకాలు చేసి, అలంకరణ చేశారు. పడమర ద్వారం మూసి వేసి, ఉత్తర, దక్షిణ ద్వారాలను తీసి పూజలు నిర్వహించారు. అలాగే బుక్కరాయసముద్రం, పుట్లూరు, గార్లదిన్నె, నార్పల, యల్లనూరు మండలాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- పామిడిలోని తగ్గదేవాలయం, పెద్ద, చిన్న విఠోబ ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామి ఉత్తరద్వార ప్రవేశం కోసం భక్తులు వేకువజామునుంచే ఆలయంలో క్యూ కట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి పల్లకిసేవలో ప్రాకారోత్సవం గావించారు. భావసార క్షత్రియ భజన బృందం కీర్తనాలాపనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమాల్లో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓలు గోపాల్, క్రిష్ణయ్య, సీఐ యుగంధర్, కవి నారాయణమూర్తి, చిన్న విఠోబ దేవాలయ కమిటీ సభ్యులు టీటీ నాగభూషణ్ రావు, రమేష్, ఉత్తర్‌కర్ మంజునాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో..

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారు ఆలయ ఉత్తర ద్వారంలో కొలువదీరి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శుక్రవారం ఉదయాన్నే ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వారి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పుష్పాలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.వాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఇతర అధికారుల ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహించి ఆలయ ఉత్తర ద్వారంలో కొలువదీర్చారు.


నార్పలలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ దృశ్యం


తాడిపత్రిలో గరుడ వాహనంపై చింతల వేంకటరమణస్వామి


తాడిపత్రి సమీపంలోని రెడ్డివారిపాలెంలో శేషవాహనంపై కోదండ రామస్వామి


గుంతకల్లు మండలంలోని తిమ్మాపురంలో కావేటి వేణుగోపాల స్వామి


గుత్తి మండలం తొండపాడులో ఉత్తర ద్వారం గుండా ప్రవేశిస్తున్న భక్తులు


పామిడి తగ్గదేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ప్రాకారోత్సవం


తాడిపత్రిలో తులసీమాల అలంకరణలో లక్ష్మీపాండురంగ స్వామి


పామిడిలో రుక్మిణీ పాండురంగస్వామి గరుడ వాహన ఊరేగింపు దృశ్యం


గుత్తి కొండపై లక్ష్మీ నరసింహస్వామి


గుత్తిలో సింహాచల నరసింహస్వామి అలంకరణ


తాడిపత్రి మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి


పెద్దపప్పూరులో శింగరబట్టు,గణపతి,అశ్వర్థనారాయణుడు


బుక్కరాయసముద్రంలో లక్ష్మీనారాయణస్వామి


శింగనమల: అలంకరణలో చెన్నకేశవుడు


గుంతకల్లులో వేంకటేశ్వరస్వామి

క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

'భక్తుల మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గుంతకల్లు రూరల్: టీటీడీ నిర్లక్ష్యం కారణంగానే ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మహేంద్ర, గాలి మల్లికార్జున, ఆలూరు నియోజకవర్గ నాయకుడు షేక్ అలమ్ నవాజ్ తదితరులు మాట్లాడారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందిన నేపథ్యంలో వారి ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన భక్తులు త్వరగా కోలుకోవాలని కోరారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ తప్పు జరిగిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహిస్తూ మృతుల కుటుంబాలకు రూ.60 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి'

పెద్దవడుగూరు: తిరుపతిలో తొక్కిస లాటలో మృతి చెందిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి పాశం రంగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాధిత కుటుంబాలకు కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారని, పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగానే తొక్కిసలాట జరిగిందన్నారు.

యువకుడిపై రాళ్లతో దాడి


గాయపడిన అజయ్

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో శుక్రవారం అజయ్ అనే యువకుడిపై మహబూబ్ బాషాతో పాటు మరో ఇద్దరు రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలు.. పట్టణంలోని పైమాల వీధికి చెందిన అజయ్ నడుచుకుంటూ వెళ్తుండగా రాళ్లతో దాడి చేసి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అజయ్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మున్సిపల్ ఆర్‌ఓ బదిలీ

గుంతకల్లు టౌన్: మున్సిపల్ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఎ.తారకనాథ్‌ను అమలాపురం మున్సిపల్ మేనేజర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర డీఎంఏ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఆర్‌ఓగా రెండు నెలల క్రితం విధుల్లో చేరిన తారక్‌నాథ్ బనగానపల్లె నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసినప్పుడు అతడిపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో అతడిని ఇక్కడ ఆర్‌ఓగా కొనసాగించకుండా డీఎంఏ కార్యాలయానికి అప్పగించాలని గత ఏడాది నవంబర్ 25న జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా తారక్‌నాథ్‌ను అమలాపురం మున్సిపాలిటీ మేనేజర్‌గా బదిలీ చేశారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయనను రిలీవ్ కూడా చేసినట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపరచండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో శానిటేషన్ అధ్వాన్నంగా మారిందని, ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు చెబుతున్నా పట్టించుకోవట్లేదు. ఇకనైనా పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు, మేస్త్రీలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో 3వ శానిటేషన్ డివిజన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణ సరిగ్గా జరగట్లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటేషన్ సెక్రటరీలు పీహెచ్ వర్కర్లపై అజమాయిషీ చెలాయించకుండా మంచిగా పనిచేయించాలన్నారు. డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్లానింగ్ సెక్రటరీల సహకారం తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మాజీ చైర్మన్ రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల ఆర్థిక సాయం

యాడికి: మండల సర్వేయర్ సుంకన్న ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఆయనకు మెరుగైన వైద్యం కోసం రెవెన్యూ ఉద్యోగులందరూ కలసి సేకరించిన రూ.50వేలను సుంకన్న సోదరులు వెంకటేష్, సురేంద్రకు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు అందజేశారు.

చివరి ఆయకట్టు వరకూ సాగునీరందించండి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

శింగనమల: మిడ్‌పెన్నార్ డ్యాం కింద ఉన్న చివరి ఆయకట్టు వరకూ హెచ్చెల్సీ సాగునీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం శింగనమలలో సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహించి, అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులకు నీరందించాలన్నారు. రాచేపల్లి లీడ్ క్యాప్‌లో చెప్పుల తోళ్ల పరిశ్రమను పునఃప్రారంభించి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. నిదనవాడ గ్రామంలో ఎస్సీలకు శ్మశాన వాటిక, భూమి లేని ప్రతి కుటుంబానికీ మూడు ఎకరాలు భూమి కేటాయించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్, శ్రీనివాసులు, సుంకన్న, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' వెంటనే అమలు చేయాలి

తాడిపత్రి అర్బన్/తాడిపత్రి రూరల్/గుంతకల్లు రూరల్/పెద్దవడుగూరు: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడిపత్రిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సొంత ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్ల స్థలమిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.4లక్షలు నగదు ఇస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు .. హామీని వెంటనే నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర, అబ్రహం, నాయక్, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి మారుతి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని సచివాలయం వద్ద ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు హుస్సేన్‌పీరా, రంగనాయకులు, అల్లాబకాస్, రంగారెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి ఎద్దడి రానీయకండి

పామిడి: మండలంలో తాగునీటి ఎత్తడి తలెత్తనీయకుండా అధికారులు సమన్వయంతో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించిన మండలమీట్‌కు తహసీల్దార్ శ్రీధరమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు, వృథానీటి మళ్లింపు, ఆరోగ్యం తదితర అంశాలపై ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ కాయల మహేష్, మజ్జిగ రాజశేఖర్, సర్పంచ్‌లు డీసీ ముత్యాల్‌రెడ్డి, పార్వతీబాయి సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య డైరెక్టర్ రమేష్‌నాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. శుక్రవారం ఆయన యర్రగుంట్ల పీహెచ్‌సీని సందర్శించి, రికార్డులు, వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో అనుమానిత డెంగీ లక్షణాలు ఉన్న రోగి ఇంటిని పరిశీలించారు. పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్ కుమార్, మలేరియా ఉప విభాగం అధికారి మద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సూపర్ వైజర్లు శ్రీధర్, విశ్వనాథ్, ఆరోగ్య కార్యకర్త సుబ్బయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

గుత్తి రూరల్/యల్లనూరు/పెద్దవడుగూరు: గుత్తి మండలంలోని బసినేపల్లిలో డ్వామా పీడీ సలీంబాషా, శ్రీపురంలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, బేతాపల్లిలో సర్పంచ్ చిన్న ఆంజనేయులు గోకులం షెడ్లను శుక్రవారం ప్రారంభించారు. అలాగే యల్లనూరు మండలంలోని పాతపల్లి, జంగంపల్లిలో 23 పశువుల షెడ్లను ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ప్రారంభించారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏలు ప్రతాప్, శ్రీనివాసులు, అదిల్, జయరాం, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. పెద్దవడుగూరు మండలంలో నిర్మించిన గోకులం షెడ్లను ఎంపీడీఓ నరసింహారెడ్డి , ఏపీఓ పుల్లారెడ్డి ప్రారంభించారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడుకు చెందిన ఆదినారాయణ, నాగరత్నమ్మ దంపతుల కుమారుడు నవీన్(25) వ్యసనాలకు బానిసై బాధ్యతలు మరిచి తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన అతడు ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు షాపులు, ఒక ఇంట్లో చోరీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో గురువారం అర్ధరాత్రి ఫోటో స్టుడియో, మోటర్‌షాపు, పైపుల షాపుతోపాటు శివన్న ఇంట్లో దొంగలు పడ్డారు. షాపుల్లో చిన్నచిన్న వస్తువులు,స్టుడియోలో రూ.10 వేల నగదు, శివన్న ఇంట్లో రూ.40 వేల నగదు, రూ.30 వేలు విలువచేసే వెండి నగలు దోచుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యల్లనూరు సొసైటీలో తనిఖీ


గోదామును పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారిణి అరుణకుమారి

యల్లనూరు: మండలంలోని యల్లనూరు సొసైటీ, పెట్రోల్ బంకు, రైతుల కోసం ఉపయోగించే బహుళ ప్రయోజన సౌకర్య గోదామును శుక్రవారం జిల్లా కో ఆపరేటివ్ అధికారిణి అరుణకుమారి తనిఖీ చేశారు. ఈసందర్భంగా సొసైటి రికార్డులను పరిశీలించారు. అనంతరం గోదాముల్లో భద్రపరచిన ఎరువులను తనిఖీ చేసి, రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సబ్ డివిజన్ కోఆపరేటివ్ అధికారి నాగరాజు, యల్లనూరు సొసైటీ ఇన్‌చార్జి శ్రీనివాసులు, సీఈఓ వీరనారప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్/గుత్తి: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె నేపథ్యంలో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం గుంతకలుల్లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్ బకాయిలివ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, మెరుగైన 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం కనీస వేతనం కింద రూ.21 వేల వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జగదీష్, నాయకులు హనుమంతు, గంగాధర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షల్లో మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు రాజా, రామాంజి, నాగేంద్ర, మహేష్, ఆది తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు.

సదస్సు జయప్రదం చేయండి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో ఈనెల 18న నిర్వహించే మాదిగ ఉద్యోగుల సమాఖ్య సదస్సును జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పసలూరి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ ఉద్యోగుల సమాఖ్యను బలోపేతం చేయడంలో బాగంగా ఈనెల 18న తాడిపత్రిలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దేవగుడి రంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.హనుమంతరావు, ఎంఎస్‌పీ తాడిపత్రి ఇన్‌చార్జి పెద్దిరాజు, జిల్లా కోశాధికారి దేవర పుల్లన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.క్రిష్ణప్ప, నాయకులు పాల్గొన్నారు.